క్లుప్తంగా

'మీ కోసం'కు రెండు వినతులు

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు రెండు వినతులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని కెంకర గ్రామానికి చెందిన నరసింహప్ప భూ సమస్యతో పాటు మరో వినతి వచ్చిందన్నారు. వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



బోల్తా పడిన లారీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి క్రాస్‌లో సోమవారం సాయంత్రం దాణా లారీ బోల్తా పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... కర్ణాటక రాష్ట్రం నుంచి పశువుల దాణాను విక్రయించడానికి లారీలో తీసుకొచ్చారు. కదిరేపల్లి క్రాస్‌లో రోడ్డు పక్క ఉన్న రూములో నిల్వ చేయడానికి లారీ డ్రైవర్ లారీని రివర్స్ చేస్తుండగా డ్రైనేజీపై ఉన్న బండ రాయి విరిగింది. దీంతో లారీ డ్రైనేజీలోకి ఇరుక్కుపోయి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై నేడు చర్చ

అమరాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం పది గంటలకు పారిశుధ్యం, తాగునీటి అంశాలపై చర్చించడానికి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తదితరులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మడకశిర: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ప్రజలు ఆరు అర్జీలు సమర్పించినట్లు తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. ఇందులో రెండు అర్జీలు రేషన్‌కార్డుల కోసం వచ్చాయన్నారు. మరో నాలుగు అర్జీలు ఆన్‌లైన్ సమస్యలపై వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ అర్జీల పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపినట్లు చెప్పారు. సత్వరమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.


రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏఓ విజయభారతికి వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

పరిగి: వ్యవసాయంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలు స్పందించి ఉదారంగా పరిష్కరించాలని అఖిల భారత రైతు–వ్యవసాయ కూలీ సంఘం జిల్లా నాయకుడు రంగనాయకులు కోరారు. దేశంలో, ప్రత్యేకించి రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ సోమవారం పరిగి మండల కేంద్రంలో మండల అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహ, మండల వ్యవసాయాధికారి విజయభారతికి అందించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరాయప్ప, శంకరప్ప, రైతులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌తో టీబీకి చెక్



నరసంబుదిలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

అగళి: టీబీ (క్షయ) నియంత్రణ చర్యల్లో భాగంగా డాక్టర్ శివనంద, గాయత్రి ఆధ్వర్యంలో బీసీసీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 18 ఏళ్లు దాటిన, ఐదేళ్ల కిందట మందులు వాడి టీబి వ్యాధి తగ్గిన వారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటు ఉన్న వారికి, 60 ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకాను వేస్తున్నట్లు డాక్టర్ శివానంద్ తెలిపారు. ఇందులో భాగంగానే తాజాగా మండల వ్యాప్తంగా 1570 మందికి వ్యాక్సినేషన్ వేశామన్నారు.

నో సిగ్నల్!

- సెల్‌టవర్లు ఉన్నా పనిచేయని ఫోన్లు
- రేషన్ నుంచి పింఛన్ దాకా అన్నింటికీ ఇబ్బందులే..
- అవస్థల్లో వినియోగదారులు
- పట్టించుకోని నిర్వహణ కంపెనీలు



అగళి: ప్రస్తుతం అందరి చేతిలో మొబైల్స్ ఫోన్స్ ఉంటున్నాయి. ఏ ఇంట్లోనైనా సరే టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు, మిక్సీలు తదితర గృహోపకరణాలు ఉన్నా లేకపోయినా సెల్‌ఫోన్ మాత్రం కచ్చితంగా ఉంటుంది. ఆధార్ మొదలుకొని బ్యాంక్ సేవలు, మొబైల్ బ్యాంకింగ్ సెల్ నంబరును ప్రస్తావిస్తూ అడుగుతున్నారంటే సెల్‌ఫోన్లు ఎంత ప్రాముఖ్యత సంతరించుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. సెల్‌ఫోన్ల వినియోగమైతే అంతకంతకూ పెరుగుతున్నా .. అందుకు తగ్గట్లుగా మాత్రం కొన్ని ప్రాంతాల్లో సెల్‌ఫోన్ టవర్లు ఏర్పాటు చేయకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, కర్ణాటక ప్రాంత సరిహద్దుల్లో ఉన్న గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో 62 పంచాయతీలు

మడకశిర నియోజకవర్గంలో 62 గ్రామ పంచాయతీలు ఉండగా దాదాపు 375 గ్రామాలు ఉన్నాయి. అందులో సుమారుగా 16 గ్రామ పంచాయతీల్లో సెల్ టవర్లు ఉన్నా సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ సక్రమంగా అందకపోవడంతో వినియోగదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సెల్ టవర్లకు సిగ్నల్స్ (ఫ్రీక్వెన్సీ) పెంచాలని వినియోగదారులు కోరుతున్నప్పటికీ ఆయా కంపెనీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

అన్నింటికీ ఇబ్బందే...

నియోజకవర్గంలోని అగళి మండలంలోని ఆలూడి, హళ్లికెర, కదరేపల్లి గొల్లహట్టి, దేవరహళ్లి, కసాపుర, అమరాపురం, మడకశిర, రొళ్ల మండలాల్లో కూడా పలు గ్రామాలకు సెల్ టవర్లు నుంచి సిగ్నల్స్ అందడం లేదు. దీంతో రేషన్ సరుకులు మొదలు బ్యాంకు సేవలు, ఇతర ఆధార్ సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మొబైల్ ఫోన్లకు ఓటీపీలు (వన్ టైప్ పాస్ట్ వర్డ్) రాకపోతుండటంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. ఒకటవ తేదీ వచ్చిందంటే చాలు పింఛన్‌దారులతో పాటు ఆయా ప్రాంతాలకు వెళ్లే సచివాలయ సిబ్బంది కూడా అవస్థలు పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత సెల్ కంపెనీలు సిగ్నల్స్ రాని గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి సెల్ టవర్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



అగళిలో ఏర్పాటు చేసిన ఓ సెల్ టవర్

చాలా ఇబ్బంది పడుతున్నాం



మా గ్రామం మండల కేంద్రానికి దూరం ఉండటం వల్ల మొబైల్ నెట్‌వర్క్ సిగ్నళ్లు సరిగా అందడం లేదు. దీంతో సెల్‌ఫోన్లు పనిచేయడం లేదు. అత్యవసర సమయంలో ఇతర ప్రాంతాలకు ఫోన్ చేయాలంటే ఎత్తైన ప్రాంతాని వెళ్లే, లేకపోతే ఇంటి పైకి ఎక్కి మాట్లాడాల్సిన దుస్థితి నెలకొంది. మా గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేసి మా ఇబ్బందులను తొలగించాలి.

– మారుతీగౌడ్, దేవరహళ్లి, అగళి మండలం

పనులు జరగడం లేదు



మా గ్రామం మండల కేంద్రానికి పది కిలో మీటర్లు దూరంలో ఉంది. మిని బ్యాంక్ సేవా కేంద్రాల్లో బ్యాంకు ఖాతాలో డబ్బులు డ్రా చేయడనికి, లేదా వేయడనికి వెళితే మొబైల్ సిగ్నల్స్ సరిగా రాక పనులు జరగడం లేదు. మా గ్రామంలో సిగ్నల్స్ రావడమే గగనంగా మారింది. ఇప్పటికైనా సెల్‌టవర్ల యాజమాన్యాలు చర్యలు చేపట్టాలి.

– మంజునాథ్ ఆలూడి, అగళి మండలం

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



సుశీలమ్మతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

పెనుకొండ: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకురాలు సుశీలమ్మ ఇంటిపై ఆదివారం టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వి ఇంటికి అతికించి ఉన్న సిద్ధం స్టిక్కర్లను తొలగించిన విషయం పాఠకులకు తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, తయూబ్, సద్దాం, కొండలరాయుడు, బోయబాబు, కిష్టప్ప తదితరులు సోమవారం సుశీలమ్మ ఇంటికి వెళ్లి ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం నాయకులు పూర్తి విషయాన్ని మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌కు వివరించారు.

ఎంపీపీకి కౌన్సిలర్ల పరామర్శ

రొద్దం: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీపీ చంద్రశేఖర్‌ను సోమవారం పలువురు పెనుకొండ వార్డు కౌన్సిలర్లు పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్లు సద్దాం, తయూబ్, బాబు, క్రిష్టప్ప, శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పరిగి: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని అనంత శక్తి సొసైటీ సీఈఓ లావణ్య తెలిపారు. మండలంలోని పీ నరసాపురంలో సోమవారం అనంత శక్తి సొసైటీ ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షురాలు తహసీన్ నేతృత్వంలో మహిళా చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మహిళలు కేవలం వంటింటికే పరిమితం కావడం వల్ల సమాజంలో గుర్తింపు లేకపోయిందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగ, ఉపాధి రంగాలతో పాటూ రాజకీయంగా ఎదగడం గర్వించదగ్గ విషయమన్నారు. అయినప్పటికీ సమాజంలో మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు జరుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చదువుతో పాటూ విజ్ఞావంతులై మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే బాల్య వివాహాలను ప్రోత్సహించరాదన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అసోసియేట్ గౌరి, రవళి, పావని, ఉపాధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, న్యాయ సలహా కమిటీ సభ్యులు, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఈఓ లావణ్య

కబ్జాను అడ్డుకుంటే తలలు తీస్తామంటున్నారు

- టీడీపీ నాయకులపై చర్యలకు సీపీఎం నాయకుల డిమాండ్

సోమందేపల్లి: 'మండల కేంద్రమైన సోమందేపల్లిలోని చేనేత కార్మికుల స్థలం ఆక్రమణకు గురికాకుండా అడ్డుకున్న తమపై టీడీపీ నాయకులు భౌతిక దాడి చేసేందుకు ప్రయత్నించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని కోరుతూ సీపీఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదేళ్ల నుంచి తమ అనుభవం ఉన్న స్థలాన్ని మూడు రోజుల క్రితం టీడీపీ నాయకుడు అమర్‌నాథ్, సిద్ధలింగప్ప తదితరులు కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న తెలిపారు. తాము స్థలంలో ఏర్పాటు చేసుకున్న నల్లబండలు, పార్టీ జెండాను వారు తొలగించినట్లు చెప్పారు. వారి దౌర్జన్యాన్ని అడ్డుకునేందుకు వెళ్లగా తలలు నరుకుతామని బెదిరించినట్లు తెలియజేశారు. తమ పార్టీ అధికారంలో ఉందన్న అహంతో తమపై దాడులతో పాటు స్థలాన్ని కబ్జా చేయడానికి వారు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందువల్ల తమకు వెంటనే రక్షణ కల్పించి స్థలాన్ని సంరక్షించాలని తహసీల్దార్ అంజనాదేవి, ఏఎస్ఐ మురళీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హనుమయ్య, వెంకటేష్, నారాయణస్వామి, మాబూ, రామకృష్ణ, నజీర్, ఆంజినేయులు, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

రహదారి సమస్య పరిష్కరించండి

గోరంట్ల: మండల పరిధిలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించి వ్యవసాయ పొలాలకు వెళ్లే దారికి ఇబ్బందిలేకుండా చూడాలని సోమవారం రైతులు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామం బయట నూతనంగా 342 నంబర్ జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఆ పనుల వల్ల పూర్వకాలం నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే రహదారి మూసుకుపోతుందన్నారు. దీంతో వందలాది మంది రైతులకు నష్టం జరుగుతుందని తెలిపారు. అందువల్ల వ్యవసాయ పొలలకు వెళ్లే రహదారిపై ఫ్లైవైర్ నిర్మించాలని రైతులు వెంకటప్ప, ఆదినారాయణరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశు, రఘునాథరెడ్డి తదితరులు డిప్యూటీ తహసీల్దార్‌కు విన్నవించారు. స్పందించిన డీటీ రెడ్డిశేఖర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు నోటీసులు



రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేసుకున్న ఎరువు దిబ్బలు

రొద్దం: మండల పరిధిలోని బీదానిపల్లి గ్రామంలో ఎరువు దిబ్బలు వేసుకున్న వారికి అధికారులు నోటీసులు జారీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలంలో కొందరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన రైతులు ఎరువు నిలువ చేసుకోవడానికి దిబ్బలు ఏర్పాటు చేసుకున్నట్లు వివరించారు. రోడ్డు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకున్నా ఎరువులు తీసేయాలని నోటీసులు ఇచ్చినట్లు వాపోయారు.

నిందితులను అరెస్టు చేయాలి

హిందూపురం: పట్టణానికి చెందిన యువ న్యాయవాది రాజ్ సంపత్ కుమార్‌ను హత్య చేసిన ప్రధాన నిందితులను అరెస్టు చేయాలి. అతని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం పుట్టపర్తిలోని కలెక్టర్, ఎస్పీ ఆఫీసుల వద్ద హిందూపురం రాజకీయ పార్టీల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈ ఏడాది మే 30న దారుణ హత్యకు గురయ్యాడని, హత్యకేసులో ప్రధాన నిందితులను నేటికీ అరెస్టు చేయలేదని నాయకులు విమర్శించారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హిందూపురంలో ఇటీవల హత్యా రాజకీయాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని, వాటిని నివారించాలని కోరుతూ డిప్యూటీ కలెక్టర్, ఎస్పీ ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి చెందుతున్న పురంలో గత ఏడాది వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, ఇటీవల న్యాయవాది సంపత్ హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి పురంవాసులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్యాంకిరణ్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కదిరేష్, ఉపేంద్ర, కలీం, హనుమంతు, అంజి, జియా, ఫిరోజ్, సలాం, షఫీ, బీఎస్పీ నాయకులు శ్రీరాములు, హరి, ఆర్ఎస్‌పీ నాయకులు శ్రీనివాసులు, తిమ్మక్క, ఎంఎస్ఎఫ్ నాయకులు రవికుమార్, ఎస్‌పీ నాయకులు థౌసిఫ్, మున్నా, షఫీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఐక్యవేదిక నాయకులు

నేటిలోపు విద్యార్థులు పాఠశాలలో చేరాలి

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని 544ఈ జాతీయ రహదారి పక్కన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికి అర్హత పరీక్ష రాసి సీట్లు సాధించిన విద్యార్థులు మంగళవారం సాయంత్రంలోపు పాఠశాలల్లో తప్పనిసరిగా చేరాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. ఒక వేళ నిర్దేశించిన సమయంలో సీట్లు సాధించిన విద్యార్థులు పాఠశాలలో చేరకపోతే తర్వాత మెరిట్ లిస్టులో ఉన్న విద్యార్థులకు ఆ సీట్లను కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5వ తరగతిలో చేరడం కోసం అర్హత పరీక్షలు రాసి ఎంపికైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

పావగడ: శ్రీ క్షేత్ర ధర్మ స్థలం గ్రామాభివృద్ధి సంస్థ సామాన్యుల కోసం రూపొందించిన పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ తాలూకా యోజనాధికారి హెచ్ మహేశ్ సూచించారు. పట్టణంలోని ధర్మస్థలం సంస్థ కార్యాలయంలో సోమవారం స్వయం సహాయ సంఘాల లబ్ధిదారులకు ఆరోగ్య బీమా పరిహారం చెక్కులను అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజల దుస్థితిని రూపు మాపేందుకు ధర్మ స్థల ధర్మాధికారులు వీరేంద్ర హెగ్గడె దంపతులు న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని ఆరోగ్య రక్ష బీమా పథకాన్ని రూపొందించినట్లు చెప్పారు. తాలూకా వ్యాప్తంగా ఈ ఏడాది 452 మంది లబ్ధిదారులకు రూ.43,27,775 బీమా సౌలభ్యం కల్పించామన్నారు. తాలూకాలో 3,150 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆరోగ్య బీమా చెక్కులు అందించారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న దృశ్యం

మూడు గదుల వేలం పూర్తి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి పంచాయతీ ఆధినంలో ఉన్న ఐదు గదులకు సోమవారం రత్నగిరి పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం పాటను నిర్వహించామని ఈఓఆర్డీ కృష్ణప్ప తెలిపారు. ఇందులో మూడు కాంప్లెక్స్ గదులకు ఒక్కొక్క గదికి నెలకు అద్దె రూపంలో రూ.1050 చెల్లించేందుకు వేలం పాట దక్కించుకున్నారన్నారు. మిగిలిన రెండు గదులు వేలం పాటను వాయిదా వేశామన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

అగళి: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతు భరోసా సిబ్బందితో ఏఓ శేఖర్‌నాయక్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శేఖర్ నాయక్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రైతులకు 2,329 క్వింటాళ్ల విత్తన వేరుశనగను పంపిణీ చేశామన్నారు. రైతులకు అందుబాటులో ఉండి తగిన సలహాలు, సూచనలు అందజేయాలన్నారు.

మడకశిరలో మోస్తరు వర్షం



మడకశిరలో వర్షం పడుతున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఇప్పటికే 35 శాతం మంది రైతులు వేరుశనగ విత్తనాలు విత్తుకున్నారు. తాజాగా కురిసిన వర్షంతో మిగతావారు విత్తు వేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

నేడు సంత మార్కెట్ వేలం

రొళ్ల: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 11 గంటలకు సంత మార్కెట్, బస్టాండ్ ఆవరణలో సుంకం వసూలు చేయడం కోసం వేలం పాటను నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ కృష్ణప్ప తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.2 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించాలన్నారు.

వేలం పాట నిర్వహించాలి

సోమందేపల్లి: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ వారపు సంతకు వేలం పాట నిర్వహించాలని కేవీపీఎస్ నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. వేలం పాట జరపక మూడు నెలలు కావస్తోందని తద్వారా ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతోందన్నారు. గతంలో కాంట్రాక్టర్ వారానికి రూ.37 వేలు పంచాయతీకి కట్టేవాడని, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతి వారం తక్కువ మొత్తంలో సుంకం రూపంలో పంచాయతీ సిబ్బంది కడుతున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే పాలక వర్గంలో కుల వివక్ష లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, మండల కార్యదర్శి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

గుడిబండ: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలనే లక్ష్యంతో విద్యాశాఖ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సోమవారం మండల పరిధిలోని నాగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్ల కార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ కవితమ్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



బస్టాండులోకి గేదెలు

పావగడ: కాపర్ల నిర్లక్ష్యంతో స్థానిక మున్సిపల్ బస్టాండ్‌లో గేదెలు సంచరిస్తున్నాయి. బస్టాండులోకి చొరబడి బస్సులకు అడ్డంగా గేదెలు నడుస్తుండటంతో బస్సులు నడపడానికి డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అందులోనూ సోమవారం సంత రోజు కావడంతో బస్టాండులో ప్రయాణికుల హడావుడి ఎక్కువగా ఉంది. జనంతో కిక్కిరిసిన బస్టాండులో గేదెల నుంచి తప్పించుకుని బస్సులు ఎక్కడానికి ప్రయాణికులు కూడా నానా తంటాలు పడ్డారు. ఇప్పటికైనా గేదెలను బస్టాండులోనికి రానివ్వకుండా జాగ్రత్త పడాలని ప్రయాణికులు, డ్రైవర్లు గేదెల కాపర్లకు సూచించారు.

అన్నదాన సత్రం నిర్వహణకు విరాళం

లేపాక్షి: లేపాక్షిలో ఉన్న అన్నదాన సత్రం నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన బ్రాండిక్స్ కంపెనీ యజమాని దొరస్వామి, మమతరాణి, ఉమాదేవి అన్నదాన కమిటీ సభ్యులకు సోమవారం విరాళమిచ్చారు. రూ. 23,348 నగదును సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపీతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పావగడ: తాలూకాలోని జంగమరహళ్ళి గ్రామానికి చెందిన మాతృశ్రీ సేవా సమితి అధ్యక్షుడు హెచ్ లక్ష్మీనారాయణ స్థానిక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు వితరణ చేశారు. నీలమ్మనహళ్లి క్లస్టర్ కు చెందిన బుడ్డారెడ్డిహళ్లి ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 7 వ తరగతి విద్యార్థులకు సోమవారం నోటు పుస్తకాలు అందించారు. అదే విధంగా దొడ్డహళ్లి, వైఎన్ హొసకోట క్లస్టర్లకు చెందిన పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. మొత్తం 3 క్లస్టర్లకు చెందిన 13 ప్రభుత్వ పాఠశాలలకు సుమారు వెయ్యికి పైగా నోటు పుస్తకాలు అందించారు. పేద విద్యార్థులకు తనవంతుగా నోటు పుస్తకాలు తదితర విద్యా సామాగ్రి అందిస్తున్నట్లు లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ ఎం ప్రకాష్ నాయక్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.